క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయండి

బంటుమిల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలపై 2023-24 సంవత్సరానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ జె.స్వర్ణభారతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలతో ఆమె మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి బడ్జెట్ ప్లాన్ తయారు చేసి విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ప్రణాళిక తయారు చేసే విధి విధానాలను ఎంఈఓ కె.ఎస్.వి.ప్రసాద్ వివరించారు. సీడీపీఓ సముద్రవేణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజబాబు, సీఆర్‌పీలు నాగబాబు, రాజు, బుజ్జి, రమాదేవి పాల్గొన్నారు.

14న సంక్రాంతి ముగ్గుల పోటీలు

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్‌లో ఈ నెల 14వ తేదీన దివిసీమ సంప్రదాయ భోగి మంటలు, మండల స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తామని క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ తలశిల నాని తెలిపారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు భోగి మంటలు, అనంతరం ముగ్గుల పోటీలు జరుగుతాయని తెలిపారు. ముగ్గుల పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు, మరో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు 97048 79799, 93925 29730, 94906 36466 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి మౌన ధ్యాన మహాయజ్ఞం

బంటుమిల్లి: స్థానిక శ్రీ కనకదుర్గ పిరమిడ్ ధ్యాన ఆధ్యాత్మిక శక్తి క్షేత్రం ఆధ్వర్యంలో బుధవారం నుంచి 11 రోజుల పాటు మౌన ధ్యాన మహా యజ్ఞం జరుగుతుందని శక్తి క్షేత్రం నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మౌన ధ్యానం కొనసాగుతుందని పేర్కొన్నారు. తొలి రోజు ఉదయం బంటుమిల్లి పుర వీధుల్లో శోభాయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం కార్యక్రమాలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు కార్యక్రమాల్లో భాగంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు శాఖాహారం, ధ్యానం తదితర అంశాలపై పలువురు గురువులు ప్రసంగిస్తారని వివరించారు.

ఘనంగా ప్రపంచ హిందీ దినోత్సవం

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్లో మంగళవారం ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టరు కె.కిషోర్ మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక జనాభా హిందీ భాషను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. జీవనోపాధి కోసం ప్రపంచ దేశాల్లో ఉన్న భారతీయులు హిందీని ఉపయోగించేందుకు ప్రభుత్వం 2006 నుంచి ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం హిందీ భాషలో విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల విజేతలకు డైరెక్టరు కిషోర్ బహుమతులు అందజేశారు.

సీఐటీయూ మహాసభల జయప్రదానికి వినతి

బంటుమిల్లి: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ బంటుమిల్లి డివిజన్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద సీఐటీయూ జండాను మంగళవారం ఆవిష్కరించారు. సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు రుస్తుంబాద, చెమ్మనగిరిపేట, రాజుగారిసెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

గూడూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను గూడూరు రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. పెడన రోడ్డు మీదుగా గూడూరు వైపు వస్తున్న లారీ, ట్రాక్టర్‌ను స్థానిక రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. వారి వద్ద మట్టి రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో తహసీల్దారు బి.వి.ప్రసాద్ జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటింటా వెలుగులు నింపుతున్న జగనన్న




కప్పలదొడ్డిలో అన్నపూర్ణకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్ ; కొత్తపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పెడన: 'ఇంటింటా వెలుగులు నింపుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. మా ఇంటాయన్ని బతికించింది ఆయన అమలుచేస్తున్న పథకాలే. అనారోగ్యానికి గురైన నా భర్తకు ఆరోగ్య శ్రీ కింద విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించాం. కోలుకుని క్షేమంగా ఇంటికి తిరిగొచ్చాడు. సంతోషంగా ఉంది' అంటూ గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన మెరుగు అన్నపూర్ణ గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌కు తెలిపింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తమ ఇంటికి వచ్చిన మంత్రికి మెరుగు అన్నపూర్ణ, నాగబాబు దంపతులు ఆత్మీయస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వారికి చేకూరిన లబ్ధిని మంత్రి జోగి రమేష్ వివరించారు. కాపునేస్తం కింద రూ.30 వేలు, ఆసరా కింద రూ.20 వేలు, సున్నా వడ్డీ కింద రూ.1,250, రూ.2 లక్షల విలువైన ఇంటి స్థలం అందాయని వివరించారు. అన్నపూర్ణ మాట్లాడుతూ.. తన భర్త నాగబాబు పక్షవాతానికి గురయ్యాక చాలా ఆస్పత్రులకు తిరిగినా నయం కాలేదని, ఖర్చులు భరించ లేక విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించడంతో నయం అయిందని సంతోషం వ్యక్తం చేసింది. మళ్లీ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అధికారంలోకి రావాలని ఆ దంపతులు ఆకాంక్షించారు. తనను కొడుకు చూడటం లేదని, జగన్‌బాబు అన్ని విధాలుగా ఆదుకుంటున్నాడని, పింఛనుతో పాటు ఆసరా డబ్బులు కూడా వచ్చాయని మరో వృద్ధురాలు మంత్రికి చెప్పి ఆనందం వ్యక్తం చేసింది. తమ గడపలోకి వచ్చిన మంత్రికి పలువురు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటూ సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ఇంటికి పెద్ద కొడుకుగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనం అన్ని విధాలుగా అండగా నిలువాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛను పెంచి ఇచ్చామని, వచ్చే జనవరికి పింఛన్ రూ.3 వేలకు చేరుతుందని తెలిపారు. తనకు జగనన్నే పింఛన్ ఇచ్చాడంటూ ఓ వృద్ధురాలు సంతోషం వ్యక్తంచేయడంతో మంత్రి స్పందించి 'నీకూ జగనన్నేనా.. కొడుకు అవుతాడు' అని నవ్వుకుంటూ ముందుకు సాగారు.

రూ.95 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు

కప్పలదొడ్డి గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడానికి జల జీవన్ మిషన్ పథకం కింద రూ.95 లక్షలు మంజూరయ్యాయని మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఇవి టెండర్ల దశలో ఉన్నాయని, ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించి 462 కుళాయిలు అవసరమని గుర్తించామని వివరించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఆర్‌బీకే వద్దకు వెళ్లేందుకు పూర్తిస్థాయిలో రహదారి లేదని మంత్రి జోగి రమేష్‌కు ఎంపీపీ సంగా మధుసూదనరావు చెప్పగా, ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి తక్షణం అంచనాలు రూపొందించాలని, అలాగే స్థానిక ఆర్‌బీకే నుంచే రైతులకు ఎరువులు అందించాలని అధికారులను ఆదేశించారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు వేయించాలని, డ్రయిన్లు నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో వాటిని నమోదు చేసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, తలుపుల వెంకటకృష్ణారావు, మోటేపల్లి రత్నారావు, మాధవి, తేజోవతి, నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, తహసీల్దారు విజయకుమార్, హౌసింగ్ డీఈ ఎ.శ్రీనివాస్, ఎంపీడీఓ సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాల్లో సంతోషం
– అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ఆయన విజయాన్ని ఆపలేరని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని కొత్తపేట, తిప్పపాలెంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు, పార్టీ నాయకుడు సింహాద్రి వికాస్ మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరోసారి విజయాన్ని చేకూరుస్తాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు స్పష్టంచేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, రామకోటిపురం సర్పంచ్ లక్ష్మి తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, షేక్ నజీర్‌బాషా, గాజుల జయగోపాల్, బడే వెంకటేశ్వరరావు, మురిమి అయ్యప్ప, చింతలపూడి బాలు తదితరులు పాల్గొన్నారు.

జేసీతో సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే పేర్ని నాని



సమస్యలపై జేసీ అపరాజితసింగ్, ఆర్డీఓ కిషోర్‌లతో మాట్లాడుతున్న పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలపై జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మంగళవారం చర్చించారు. జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలకల్పన, గృహనిర్మాణాలకు సంబంధించిన సమస్యలపై జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో చర్చించారు. త్వరితగతిన లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, తహసీల్దార్ సునీల్‌బాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని కరగ్రహారంలో పేదలకు పంపిణీ చేసిన జగనన్న కాలనీని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. పేదలు అందరికీ గూడు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. అందుకోసం జగనన్న కాలనీలు ఏర్పాటుచేశారని వివరించారు. అర్హత ఉండీ స్థలాలు మంజూరు కాని పేదలు ఇంకా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వారికి లబ్ధిచేకూరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రెండో డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

అవనిగడ్డ: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఎస్వీఎల్ క్రాంతి విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి వికాస్ పార్టీ కార్యాలయం నుంచి కాలేజీ వరకూ ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై డప్పు వాయిద్యాలు, మేళతాళాల సందడితో ర్యాలీగా వచ్చారు. అనంతరం కాలేజీలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను రానున్న తరానికి అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని చెప్పారు. సంక్రాంతికి యువత జూద క్రీడలకు దూరంగా ఉండాలని సూచించారు. సంప్రదాయ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా భోగిమంటలు, గంగిరెద్దు విన్యాసాలు, కోడిపందేలు, జానపద నృత్యాలతో సందడి చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. డీఎస్పీ మహబూబ్ బాషా, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎస్వీఎల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎడ్ల బండి పై ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వికాస్



సరదాగా కోడి పందేలు

లేడీ యాంప్తిల్ కాలేజీలో సంబరాలు

చిలకలపూడి(మచిలీపట్నం): స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులతో నృత్యాలు, హరిదాసుల పాటలు, బొమ్మల కొలువులతో విద్యార్థులు సందడి చేశారు. కార్పొరేటర్ గాజుల శ్రీదేవి ఈ సంబరాలను లాంఛనంగా ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనంద కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానందలో..

చల్లపల్లి: సంక్రాంతి వేడుకల సందర్భంగా మంగళవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 108 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొని అందమైన రంగవల్లికలు తీర్చిదిద్దారు. ఈ పోటీలకు గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, జయలక్ష్మి, సుమాల్య, మాధురి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు విద్యాసంస్థ కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రమేష్ బాబు, తగిరిశ సాంబశివరావు బహుమతులు ప్రదానం చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతిరమణి



పొలాల్లో రైతులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతిరమణి

కోనేరుసెంటర్: రైతులు మంచి వ్యవసాయ (యాజమాన్య) పద్ధతులు పాటించి ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి సూచించారు. అప్పుడే అధిక దిగుబడులు వస్తాయన్నారు. మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యం సుల్తానగరంలో రైతులకు మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి మాట్లాడుతూ.. మండలంలోని సుల్తానగరం, ఎస్.ఎన్.గొల్లపాలెం, అరిశేపల్లి గ్రామాల్లో మంచి వ్యవసాయ పద్ధతులతో మేలైన దిగుబడి సాధించేలా రైతులను సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఈ గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) ఎంపిక చేశామన్నారు. ఈ మూడు గ్రామాల్లో ప్రతి మంగళ, బుధ, గురువారాల్లో పొలాల వద్ద రైతుల భాగస్వామ్యంతో మంచి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, ఆచరించేలా చేస్తామన్నారు. ఈ మూడు గ్రామాల్లో మొత్తం 163 మంది రైతులు 100 హెక్టార్లలో వరుసగా మూడు సంవత్సరాలు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంచి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చేసి మూడు సంవత్సరాల తరువాత ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. తద్వారా మెరుగైన ధరకు తమ ఉత్పత్తులను అమ్ముకునే అవకాశాన్ని వ్యవసాయశాఖ కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్

కోడూరు: పాఠశాలకు రాకుండా తిరుగున్న పిల్లల కోసం కోడూరు మెయిన్ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కాశీభోట్ల నాగభూషణం పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఇస్మాయిల్ బేగ్‌పేట, యర్రారెడ్డివారి పాలెం, కోడూరు గ్రామాల్లో పాఠశాలకు రాకుండా ఇళ్ల వద్దే ఉంటున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఇస్మాయిల్ బేగ్‌పేట గ్రామంలో కర్రా నరేష్, నీలాసాయిల తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లను పాఠశాలకు పంపడానికి అంగీకరించారు. దీంతో చిన్నారులకు మెయిన్ పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చారు. విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యాకానుక పథకాలు కూడా అందేలా చర్యలు తీసుకుంటామని నాగభూషణం తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు బుక్స్, బ్యాగులను అందించారు. సచివాలయ కార్యదర్శి తుంగల వెంకటశివ, ఉపాధ్యాయులు శ్యామల, సుమన్, లక్ష్మి వలంటీర్లు శ్రావణి, రజని పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌లో బయటపడిన అవినీతి

డ్వామా ఏపీడీ నాంచారరావు

మోపిదేవి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు డ్వామా ఏపీడీ ఎస్.ఎస్.వి.నాంచారరావు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ నివేదికలో 2020-21 సంవత్సరానికి రూ.14,850, 2021-22 లో రూ.15,136 మేర రికవరీ చేయాలని డ్వామా ఏపీడీ ఆదేశించారు. రూ.28,29,527 విలువైన పనులకు ఇంకా ఆధారాలు సమర్పించలేదని నిర్ధారించి, ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. చాలా చోట్ల నాటిన మొక్కలు మాయమైనట్లు గుర్తించామన్నారు. వెంకటాపురం ఫీల్డ్ అసిస్టెంట్ రత్నారావు మాత్రం మొక్కలు బాగా పెంచారని, మిగిలిన ఫీల్డ్ అసిస్టెంట్లు అతన్ని చూసి నేర్చుకోవాలని సూచించారు. డ్వామా డీవీఓ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. మస్టర్స్‌లో ఎక్కువగా దిద్దుబాటలు ఉన్నట్లు గుర్తించామన్నారు. క్లస్టర్ ఏపీడీ శ్రీలత మాట్లాడుతూ.. పనుల ఫొటోలు అప్‌లోడ్ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, లక్ష్యాలు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఎస్ఆర్‌పీ సీహెచ్ రాజు, ఏపీఓ మజ్ను, ఎంపీడీఓ పార్వతి, ఈఓపీఆర్డీ అరుణకుమారి, టీఏ, ఎఫ్ఏలు, ఎన్ఆర్ఈజీఎస్ కూలీలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీ సభ్యులు హాజరు కాకపోవడం గమనార్హం.



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ నాంచారరావు

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని 31వ డివిజన్‌కు చెందిన గాలి శివప్రసాద్ ఇటీవల మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10 వేలు నగదును కార్పొరేటర్ యంత్రపాటి నాగేశ్వరరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివప్రసాద్ మృతితో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చులకు రూ.10 వేలు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే మరో రూ.90 వేలు మంజూరవుతాయని పేర్కొన్నారు. డివిజన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు పీఏసీఎస్ సేవలు భేష్

గూడూరు: మండల కేంద్రమైన గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రైతులకు అందిస్తున్న సేవలు ఆదర్శంగా ఉన్నాయని ఆప్కాబ్ ఏజీఎం డి.సింధుజ అభినందించారు. గూడూరు పీఏసీఎస్‌ను ఆమె మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావును అడిగి తెలుసుకున్నారు. రైతుల కోసం నాబార్డు ఆర్థిక సహకారంతో కమ్యూనిటీ హాలును అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా పీఏసీఎస్ పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. రైతులకు విస్తృత సేవలు అందిస్తున్న చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావును ఆమె సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ డెవలప్‌మెంట్ సెక్షన్ మేనేజర్ తోట జగదీష్, పీఏసీఎస్ సీఈఓ ఎల్.వి.ఎ.చక్రవర్తి, కోడూరు వెంకయ్య పాల్గొన్నారు.



తలుపుల కృష్ణారావును సత్కరిస్తున్న ఏజీఎం సింధుజ

విద్యతోనే ఆర్థిక అసమానతలు దూరం

కృత్తివెన్ను: విద్య ఎంతో శక్తివంతమైనదని, మనిషి జీవన విధానాన్ని మార్చడంతో పాటు ఆర్థిక అసమానతలను దూరం చేస్తుందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. కృత్తివెన్నులో మంగళవారం జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఉపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, ఆవాస ప్రాంత ప్రణాళిక, 2023-24 ఆర్థిక సంవత్సరం అమలు చేయబోయే కార్యక్రమాల రూపకల్పన, వాటికి బడ్జెట్ కేటాయింపులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. ఎంపీడీఓ పిచ్చిబాబు, ఆర్‌పీలు పద్మజారాణి, పురుషోత్తం, వీరబాబు, సోమశేఖర, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్టు

పెడన: మండలంలోని నందమూరు పంచాయతీ జయంతి కాలనీలో పేకాడుతున్న పది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ మంగళవారం తెలిపారు. జయంతి కాలనీలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం అర్ధరాత్రి దాడి చేసి, జూదరులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద రూ.5,170 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

భర్తను కొట్టారంటూ మహిళ ఫిర్యాదు

తన భర్తను అకారణంగా కొట్టారంటూ మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన చిన్నంశెట్టి నాగలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త ఏసుబాబును కొఠారి బసవయ్య కొట్టారని ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. మహిళకు గాయాలు

పెడనలోని బంటుమిల్లి రోడ్డు సెంటరులో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో బొర్రా వెంకటలక్ష్మి (52) గాయపడింది. ఆమె మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అవుట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 26వ డివిజన్‌లో ఇటీవల మారిశెట్టి పిచ్చమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు ఆ డివిజన్‌లోని సామాజిక పింఛనుదారులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. పిచ్చమ్మ మృతితో తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున సేకరించి మొత్తం రూ.44,300లను మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్ మాడపాటి విజయలక్ష్మి, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మాడపాటి వెంకటేశ్వరరావు కలిసి పిచ్చమ్మ కుమార్తెలకు ఈ మొత్తాన్ని అందజేశారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాకోళపు నరసింహగుప్తా, బడే భానుతేజ, చిత్తజల్లు రాజు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

మచిలీపట్నంటౌన్: ఓగీస్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు కార్పొరేటర్ షేక్ షాహీనా మంగళవారం జగనన్న సంపూర్ణపోషణ కిట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కిట్లలో ఉండే పోషకాహారాన్ని ప్రతి బాలింత, గర్భిణులు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పరాసుపేట ఆర్‌సీఎం చర్చిలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పునీత పాదువాపురి ఆంటోనీ గౌరవార్థం ఈ ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ లాం జయరాజు ఆధ్వర్యంలో దివ్య బలిపూజ సమర్పించారు. సిస్టర్లు విన్సెంట్‌పాల్ సొసైటీ సభ్యులు, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లకు రేడియం స్టిక్కర్లు అంటించాలి

మోపిదేవి: చెరకు, ఇసుక, గడ్డి రవాణా చేసే ఎడ్ల బండ్లకు రేడియం స్టిక్కర్లు కచ్చితంగా అతికించాలని చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ సూచించారు. మోపిదేవి అవుట్‌పోస్టు వద్ద ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఒక వ్యక్తి మరణించగా, ఎద్దు మృతిచెందిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదాలకు కారణం, రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనదారులు బండ్లను గుర్తించక పోవడమేనన్నారు. ఇక నుంచి రవాణా చేసే బండ్ల తప్పని సరిగా రేడియం స్టిక్కర్లు అంటించాలని యజమానులకు సూచించారు. ఎస్ఐ పద్మ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 43వ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డివిజన్ ఇన్‌చార్జ్ చిటికిన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం దుస్తులు పంపిణీచేశారు. సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

గూడూరు: ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని మిల్లర్లకు గూడూరు తహసీల్దారు బి.విజయప్రసాద్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. మాండూస్ తుపాను కారణంగా వర్షాలకు దెబ్బతిన్న ధాన్యం కొనుగోలు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు దెబ్బతిన్న ధాన్యం రేటు నిర్ధారిస్తారని పేర్కొన్నారు. పది శాతం దెబ్బ తిన్న ధాన్యాన్ని క్వింటా రూ.1930, పది నుంచి 20 శాతం దెబ్బతింటే రూ.1750, 20 నుంచి 30 శాతానికి రూ.1530, 30 నుంచి 40 శాతం లోపు రూ.1400, 40 శాతం పైబడి దెబ్బతిన్న ధాన్యాన్ని రూ.1300 చొప్పున కొనాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు రైతుకు మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత మిల్లర్లు తీసుకోవాలని స్పష్టం చేశారు.